Eenadu Dt- 10/06/18.

# వచ్చే మార్చి నాటికి మెట్రో కారిడార్-2 పూర్తి

- ప్రజారవాణా అనుసంధాన వ్యవస్థపై ప్రత్యేక దృష్టి
- దేశంలో తొలిసారిగా నగరంలో బ్యాటరీ ఛార్జింగ్ పాయింట్లు
- 'స్టాంప్' వేదికగా కుదిరిన ఒప్పందం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది మార్చి నాటికి మెట్రో కారిడార్-2 పనులను పూర్తి చేస్తామని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. తద్వారా జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ఎంజీబీఎస్ వరకు మెట్రో అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ పనులు పూర్తిచేస్తే మెట్రో ఫేజ్-1 పూర్తయినట్లే అన్నారు. బంజారాహిల్స్‌లోని పార్క్‌హయత్ హోటల్‌లో శనివారం డబ్ల్యూఆర్ఐ ఇండియా సంస్థ, టయోటా మొబిలిటీ ఫౌండేషన్(టీఎంఎఫ్), తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్ మెట్రో రైల్(హెచ్ఎంఆర్)ల భాగస్వామ్యంతో 'స్టేషన్ యాక్సెస్ అండ్ మొబిలిటీ ప్రోగ్రాం(స్టాంప్) చాలెంజ్‌'ను ఇక్కడ ప్రారంభించారు. హైదరాబాద్ మెట్రో ప్రయాణికుల రవాణా అనుసంధాన వ్యవస్థను మెరుగు పరిచేలా సృజనాత్మక పరిష్కారాలను చూపేందుకు ఈ వేదికను ప్రారంభించారు. ఇందులో భాగంగా అంకుర సంస్థలు, ఇతర పారిశ్రామిక సంస్థలు ఉత్తమమైన ఆలోచనలతో నెలరోజుల్లో ముందుకొస్తే వాటిలోని అత్యుత్తమమైనవి ఎంపిక చేసి ఈ వేదిక ప్రోత్సాహాన్ని అందిస్తుంది. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. మియాపూర్-అమీర్‌పేట, అమీర్‌పేట-నాగోల్ వరకు దాదాపు 30 కి.మీల మేర మెట్రో రైలు కొనసాగుతోందన్నారు ఇప్పటికే అమీర్‌పేట-ఎల్‌బీనగర్ 16 కి.మీల మార్గంలో పనులు పూర్తయ్యాయి. ట్రయల్ రన్ మొదలుపెట్టి జులై చివరి నాటికి పూర్తి చేస్తాం. ఆగస్టులో ఈ దారిని ప్రారంభిస్తాం. అమీర్‌పేట-హైటెక్ సిటీ వరకు పనులు వేగంగా జరుగుతున్నాయి. అక్టోబరులో ఈ 10 కి.మీల మార్గాన్ని ప్రారంభిస్తాం. జూబ్లీహిల్స్ బస్‌స్టేషన్ నుంచి ఎంజీబీఎస్ వరకు కారిడార్-2కు చెందిన 10 కి.మీ. మార్గం వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తే ఫేజ్-1 పూర్తవుతుందని ఆయన వివరించారు.



స్టాంప్ ఛాలెంజ్‌ని ఆవిష్కరిస్తున్న ఎన్వీఎస్‌రెడ్డి, జయేష్‌రంజన్, కృష్ణప్రసాద్ తదితరులు

## మెట్రో స్తంభాలకు యూనిక్ నంబర్లు

నగరంలో చిరునామాలు తెలుసుకోవడం కష్టమైన నేపథ్యంలో మెట్రో పిల్లర్లకు కారిడార్ల వారీగా యూనిక్ నంబరింగ్ ఇస్తామని ఎన్వీస్ రెడ్డి స్పష్టం చేశారు. కారిడార్-1కు ఎ, కారిడార్-2కు బి, కారిడార్-3కు సి సిరీస్‌లతో ఆయా నంబర్లను అందిస్తామన్నారు. వీటిని గూగుల్‌కు అనుసంధానిస్తామన్నారు. పాత బస్తీ గురించి ఎన్వీఎస్ రెడ్డి వివరిస్తూ ఇక్కడ మెట్రో పరిధిని నిర్ణయించి తద్వారా భూసేకరణ ప్రారంభిస్తామన్నారు. ప్రధానంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు అన్ని వైపుల నుంచి అనుసందానించేందుకు యోచిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే పశ్చిమం వైపు రాయదుర్గం ఉన్న చిన్న ప్రాంతాన్ని కలపాలి. నాగోల్ నుంచి ఎల్‌బీనగర్‌కు, ఎల్‌బీనగర్ నుంచి ఫలక్‌నుమా, ఫలక్‌నుమా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు అనుసంధానం చేయాలని చూస్తున్నాం అన్నారు.

## ఉత్తమ ఆలోచనలకు రూ.10 లక్షలు..

దేశంలో తొలిసారిగా మెట్రో స్టేషన్‌లలో ఎలక్ట్రిక్ ఛార్జింగ్ పాయింట్లను పవర్‌గ్రిడ్‌తో కలిసి ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మియాపూర్, నాగోల్ మెట్రో స్టేషన్‌లలో ఈ పనులు ప్రారంభమయ్యాయని ఎన్వీస్ రెడ్డి తెలిపారు. ఈమేరకు పవర్‌గ్రిడ్, హెచ్ఎంఆర్, ఎల్అండ్‌టీ మెట్రోరైలు సంస్థలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నాయి. సరైన అనుసంధాన రవాణా వ్యవస్థ కోసం స్టాంప్ పేరుతో యువ పారిశ్రామికవేత్తలను, అంకుర సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఉత్తమ ఆలోచనలు చేసే వారికి ఒప్పంద సంస్థలు రూ.10లక్షలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, డబ్ల్యూఆర్ఐ ఇండియా సంస్థ ప్రతినిధి మాధవ్ పాయ్, ఎల్‌టీఎంఆర్‌హెచ్ఎల్ సీఓఓ ఎ.కె. సైని, టీఎంఎఫ్ సీఓఓ షిన్ ఆయోమా, రహదారి భద్రత విభాగ ఛైర్మన్, డీజీపీ టి.కృష్ణప్రసాద్, టయోటా కిర్లోస్కర్ మోటర్స్ ఉపాధ్యక్షులు శేఖర్ విశ్వనాథన్ పాల్గొన్నారు.